# గరె ముక్క

-మాకరాజు శ్రీనివాసరాజు

సత్యనారాయణశర్మ గారు సముద్రం వైపుచూస్తూఅలాగే కూర్చున్నారు.

చీకటిపడింది.

అందరూ ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు.

కాని శర్మగారు కదలలేదు.

జేబులో శనక్కాయల పొట్లంతీసి, చేత్తొ పట్టుకున్నారు.

కాని ఒక్క కాయకూడా తినలేదు.

అలాగే పట్టుకుని కూర్చున్నారు.

అప్పుడే ఆరు అయింది. ఇంకా హుస్సేన్‌మాస్టారు రాలేదేమిటి? రోజూ అయిదింటికే ఇక్కడ కలుసుకొనేవాళ్ళం ఈమధ్యన ఎందుకో మాస్టారుఆలస్యంగా వస్తున్నారు. ఏమైనాసరే ఇవాళకారణం తెలుసుకోవాలి" మనస్సులో నిర్ణయించుకొన్నారు శర్మగారు.

సరిగ్గా వారంరోజుల క్రితం ఇదే రోజున అంటే శనివారంనాడుహుస్సేన్ మాస్టారుతో పరిచయమయింది శర్మగారికి.

ఈ వారంరోజుల్లోనే వారు విడిపోలేని మిత్రులయ్యారు.

కారణం-వారి జీవనపయనం ఒకే సరళరేఖపై సాగుతుండటం కావొచ్చు.

ఒకరిబాధలు ఒకరికి చెప్పుకోవటం-ఒకర్నిఒకరు ఓదార్చుకోవటంవారిదైనందిన కార్యక్రమం.

సరిగ్గా వారంరోజుల క్రితం ఇదే రోజున అంటే శనివారంనాడు శర్మగారు సముద్రం ఒడ్డున కూర్చొని వున్నారు.

అలవాటైన ఒంటరితనం అయినావిసుగ్గానే వుంది.

కూర్చొని, కూర్చొని విసుగుపుట్టింది కాబోలు తలక్రింద రెండుచేతులు పెట్టుకొని ఇసుకమీద పడుకున్నారు.

ఆకాశంలోని చుక్కల్నిచూస్తూఏదో ఆలోచిస్తున్నారు.

అంతలో ఓ నక్షత్రం రాలి క్రింద పడింది.

"ఈ నక్షత్రం ఎప్పుడు రాల్తుందో" శర్మగారు నవ్వుకున్నారు.

"అప్పుడే ఎలా రాల్తుంది? అనుభవించాల్సిన బాధలు ఇంకా చాలా వుండగా" శర్మగారు బాధగా కళ్లు మూసుకున్నారు. కన్నీళ్ళు పొంగి చెంపలమీదకిపాకాయి.

"నమస్కారమండి" ఎవరిదో అపరిచిత కంఠం విన్పించంది.

శర్మగారు ఉలిక్కిపడి, కళ్లు తుడుచుకొని, తల అటు తిప్పారు.

ఎవరో మహమ్మదీయుడు చిరునవ్వుతో ఎదురుగా నిల్చున్నాడు.

ఎవరీతను? ఎప్పుడూ నేనుచూసినట్లులేదే? ఇతనికి నేనెలా తెలుసు? అని మనసులో అనుకొని తప్పదన్నట్లుగా పైకి "నమస్కారం" అన్నారు శర్మగారు

ఆమహమ్మదీయ వ్యక్తి శర్మగారికి కొద్దిదూరములో ప్రక్కన కూర్చొన్నాడు.

"మిమ్మల్ని నేను చాలాకాలమునుంచి చూస్తున్నాను. మీరొక్కరే వస్తారు, చాలాసేపు వుంటారు. ఎవరితో మాట్లాడరు, ఎవరితో కలవరు. ఒంటరితనం మీకు విసుగనిపించటంలేదూ?" మహమ్మదీయవ్యక్తి సంభాషణ ప్రారంభించాడు

శర్మగారికి ఏమి సమాధానం చెప్పాలో తోచలేదు. చిన్నగానవ్వి వూరుకున్నారు. "ఎవరీ అపరిచితవ్యక్తి? ఏమిటీ అపరాధ పరిశోధన. రోజూ ఇతను నన్నెందుకు పరిశీలిస్తున్నట్లు?" మనస్సులో గొణుక్కున్నారు.

మళ్ళీ మహమ్మదీయవ్యక్తి మాట్లాడటం మొదలుపెట్టాడు. "నాపేరుహుస్సేన్ అందరూ హుస్సేన్‌మాష్టార్ అంటారు. నేను ఎలిమెంటరీ స్కూల్లో టీచర్‌గా పనిచేసి రిటైరయ్యాను మరి మీరో?"

శర్మగారికి ఒళ్ళు మండిపోయింది. "ఇతనికి ఈ వివరాలన్నీ ఎందుకు? కానీ పైకి కోప్పడటం సభ్యతకాదు కనుక, ఎలాగో నిగ్రహించుకొని "జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగు మాష్టారిగా పన్చేసి రిటైరయ్యాను" ముక్తసరిగా అని వూరుకున్నాడు.

"అంటే మనమిద్దరం ఒకే సరళరేఖపై వున్నామన్నమాట.

శర్మగారుఆశ్చర్యపోయారు. "అంటే ....?"

"అంటే ఏముందండి? రిటైరోనోళ్ళ కథలు ఎలా వుంటాయి? కొడుకులమీదో కోడళ్ళ మీదో ఆధారపడివాళ్ళు చెప్పిన చాకిరంతాచేస్తూ, వాళ్ళువిదిల్చిన నాలుగు మెతుకులుఏరుకుంటూ, చావలేకజీవిస్తూ, జీవితాలను దొర్లించుకుపోవటం...." హుస్సేన్ మాష్టారి కంఠము దుఃఖముతో బొంగురుపోయింది.

శర్మగార్ని ఆమాటలు కదిల్చాయి. వెంటనే లేచి కూర్చున్నారు.

"మాష్టారూ.... రిటైరయినోళ్ళ అందరి కథలు ఇలాగే వుంటాయని ఎలా అనుకుంటున్నారు? అందరి సంగతి ఏమో కానీ నాకథకూడా ఇలాంటిదేఅని ఎలా వూహించారు?" ఆసక్తిగా అడిగారు శర్మగారు.

"ఊహించటానికి ఏముందిమాష్టారూ మీఇంటిదగ్గర మీకొడుకుగానీ,మీకూతురు గానీ నిజంగా మిమ్మల్ని సుఖపెడుతుంటే మీరు ఇంతదూరంలో సముద్రం ఒడ్డుదాకా వచ్చిఒంటరిగావుండేవారుకాదు ఒకవేళవచ్చినా ఇంతసేపు వుండేవారు

కాదు. ఒకవేళ వున్నా ఎవరితో మాట్లాడకుండా, ఎవరితో కలవకుండా ఇలా ఒంటరిగా వుండేవారుకాదు. అంతేకాదు, ఏనాడూ మీముఖంలో నేను చిరునవ్వుని చూడలేదు- యిదిచాలదా మాస్టారూ మీకథ ఎలావుందో తెలుసుకోటానికి ..."

హూప్వేన్ మాస్టారి పరిశీలనా శక్తికి ముగ్ధులయ్యారు శర్మగారు.

ఇంకా హూప్వేన్ మాస్టారే ఏదో మాట్లాడుతూనే వున్నారు. "మిమ్మల్ని చూసిన మొదటిరోజే అనుకున్నాను. మీ కథ కూడా అచ్చం నా కథ లాంటిదేనని. అందుకే మీకు చేరువవ్వాలనుకున్నాను. కాని ధైర్యం చాలక ఇంతకాలం వూరుకున్నాను. కాని ఇవాళ అల్లా ఎందుకో నాకు అంతులేని శక్తి ఇచ్చి మీదగ్గరికి పంపించాడు. అందుకే వచ్చాను. తప్పు అయితే మన్నించండి." హూప్వేన్ మాస్టారు చేతులు జోడించి, వెళ్ళటానికి లేవబోయారు.

శర్మగారు వెంటనే హూప్వేన్ మాస్టారి చేతులు పట్టుకున్నారు. "లేదు. లేదు- మీరు అలా అనుకోవటం లేదు. మీతో పరిచయమవ్వటం నిజంగా నా అదృష్టం- ఇంతకాలం అంతులేనిఒంటరితనంతో అలమటించాను. గుండెకుమిలిపోయాను. ఇన్నాళ్ళకి ఆ శ్రీమన్నారాయణుడే దయతలచి మిమ్మల్ని నా దగ్గరికి పంపించాడు..."

"అంతమాట అనకండి మాస్టారు- ఇది మీ అదృష్టం కాదు, నా అదృష్టం ఇదంతా ఆ అల్లా అనుగ్రహం." మోకరిల్లి అల్లాకు నమస్కరించారు హూప్వేన్ మాస్టారు.

"మాస్టారూ చాలా పొద్దుపోయింది- ఇక యింటికి వెళదామా? రేపు తప్పక కలుస్తారుగా."

"తప్పక కలుస్తాను-అల్లా కరుణించి బ్రతికించి వుంటే"

ఇద్దరూ లేచారు-

వారి చీకటి బ్రతుకులో వెన్నెల కాంతులు ప్రసరించాయి.

వెన్నెల విరగ కాస్తోంది-

ఇద్దరూ యింటివైపు యిసుకలో రెండు అడుగులు వేసారు.

ఇక హూప్వేన్ మాస్టారు ముందుకి కదలలేక పోయారు.

అక్కడే ఆగిపోయారు.

ప్రక్కనే వున్న శర్మగారి చేతిని గట్టిగా పట్టుకున్నారు.

శర్మగారికి ఏమీ అర్థం కాలేదు.

హూప్వేన్ మాస్టారి ఒళ్ళు తూలుతుంది;

కళ్ళు తిరుగుతున్నాయి-

నాలిక తడారి పోతోంది.

కళ్ళ ముందు మసక పొరలు కమ్ముకుంటున్నాయి-

ఈ చరాచర జగత్తు అంతా మిథ్య అన్నట్టు గిరగిరా తిరిగిపోతుంది.

ఏమీ కనిపించటం లేదు

అంతే- హూప్వేన్ మాస్టారు ధనేలున ఇసుక కుప్పపై కుప్ప కూలిపోయారు.

శర్మగారు భయంతో "మాస్టారు"

ఆవి కెవ్వున కేక వేసారు.

ఆ కేక సముద్రప్రాంతమంతా ప్రతిధ్వనించింది,

ఆ కేకకి అదిరిపడ్డాయి కాబోలు- సముద్ర కెరటాలు కూడా ఉవ్వెత్తునలేచి ఒడ్డున పడ్డాయి.

శర్మ గారికి ఏం చేయాలో తోచలేదు

క్రింద కూర్చుని హుస్సేన్ మాస్టార్ని కదుపుతూ "మాస్టారూ—" ముఖంలో ముఖం పెట్టి చిన్నగా పిల్చారు.

హుస్సేన్ మాస్టారు ఏదో మాట్లాడబోయారు

కాని మాట బయటకు రాలేదు.

గుడకలు మింగారు

నాలుక మాటిమాటికి బయటికొస్తుంది

కండ్లు మూతలు పడుతున్నాయి.

కండ్లముందు చీకట్లు కమ్ముకుంటున్నాయి

శర్మగారు కంగారుగా హుస్సేన్ మాస్టారి నాడి చూసారు.

నీరసంగా చిన్నగా కొట్టుకుంటుంది.

శర్మగారికి ఏంచేయాలోఅర్థంకాలేదు

చుట్టూ చూశారు

పల్చగావున్న జనం అక్కడక్కడ కన్పించారు.

అందరూ ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు.

"భగవంతుడా ఏమిటయ్యా నీలీలలు ఇంత మంచి మిత్రుడ్ని ఇప్పుడే పరిచయం చేసి, అప్పుడే తీసుకెళదామనుకుంటున్నావా? ఈ ఒంటరి వాడ్ని మళ్ళీ ఒంటరిగానే మిగుల్చుదామనుకుంటున్నావా? ఇదేమి న్యాయమయ్యా నీకు ఇదెక్కడి ధర్మమయ్యా నీకు?— భగవంతుడా నిన్నేమీ కోరను, నా ప్రాణాలు తీసుకోనయినా హుస్సేన్ మాస్టార్ని బ్రతికించు—" శర్మ గారు దుఃఖంతో భగవంతుడ్ని ప్రార్థించారు.

వారి కళ్ళనుండి కన్నీళ్ళు కాలువలవుతున్నాయి

ఆశ్చర్యం

హుస్సేన్ మాస్టారు చిన్నగా లేచి కూర్చున్నారు

మూతలు పడుతున్న కళ్ళని చిన్నగా తెరిచారు.

చిన్నగా లేచి నిలబడి తూలుకుంటు సముద్రం దగ్గరకు వెళ్ళి ముఖం కడుక్కున్నారు.

శర్మగారికి ఇదంతా కలలా వుంది.

అలాగే ఆశ్చర్యంతో చూస్తున్నారు.

అంతలో ఓ పెద్ద కెరటం ఎగిరివచ్చి హుస్సేన్ మాస్టార్ని సముద్రంలోకి లాగబోయింది,

వెంటనే శర్మగారు మెరుపులా వచ్చి హుస్సేన్ మాస్టార్ని ఇవతలకులాగారు. ఇద్దరూ విసురుగా వచ్చి ఒడ్డున వడ్డారు.

ఒకర్ని ఒకరు ఆనందంతో కౌగలించుకున్నారు.

"మాస్టారూ ఏమయింది? ఎందుకు పడిపోయారు ?" శర్మ గారు ఆత్రుతగా అడిగారు

"ఏమీలేదు" హుస్సేన్ మాస్టారు చిన్నగా నవ్వారు

"ప్లీజ్ చెప్పండిమాస్టారు—నాదగ్గర దాపరికమా ?"

"ఏమీలేదు. కళ్ళు తిరిగాయి"

"ఎందుకని?"

హుస్సేన్ మాస్టారు మాట్లాడలేదు.

"ప్లీజ్ చెప్పండి—" హుస్సేన్ మాస్టార్ని శర్మగారుచేత్తో కుదిపారు.

హుస్సేన్ మాస్టారికళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

రెండు కన్నీటిబొట్లురాలి శర్మగారి పాదాలపై పడ్డాయి.

నీరసంగా అన్నారు హుస్సేన్ మాస్టార్ "నిన్నటినుంచి భోజనం చేయ లేదు"

శర్మగారు వారిజేబులో నుంచి పది రూపాయలుతీసి, హుస్సేన్ మాస్టారి జేబులో పెట్టి, వారిచేయిపట్టుకొని, వార్ని ఎక్కడికో లాక్కెళ్ళసాగారు.

"వద్దు....వద్దు.... మాస్టారూ ప్లీజ్ తీస్కొండి" హుస్సేన్ మాస్టార్ ప్రతి మిలాడుతూనే వున్నారు.

కాని శర్మగారు వినిపించుకోవటం లేదు. హుస్సేన్ మాస్టార్ని వదలటం లేదు. అలాగే పట్టుకొని హోటల్ కి లాక్కెళ్ళి భోజనానికి ఆర్డరిచ్చారు.

భోజనంవచ్చింది, హుస్సేన్ మాస్టారి కళ్ళు చెమర్చి ఆనంద బాష్పాలు గుమ్మ రించాయి. అంతులేని ఆనందంతో అన్నంకలిపి మొదటిముద్ద శర్మగారి నోటికి అందించారు.

"వద్దు. మీరుతినండి" అని శర్మ గారు వారించబోయారు.

కాని హుస్సేన్ మాస్టార్ వినిపించు కోలేదు. బలవంతంగా తినిపించారు.

శర్మగారు ఆనందంగా ఆ మొదటి ముద్దని నోటితో అందుకున్నారు.

ఆతర్వాత హుస్సేన్ మాస్టార్ చక చకా అన్నం కలుపుకొని తినసాగారు. పాపం అన్నంతిని ఎన్నాళ్ళయిందో- ఇంతింత లావుముద్దలు అవురావురని తినసాగారు.

శర్మగారు ఆనందంతో కళ్ళు తుడుచు కున్నారు.

* * *

ఆనాటి ఆమొదటి పరిచయాన్ని జ్ఞప్తికి తెచ్చుకొంటున్న శర్మగారు, చిన్నగా ఇటు తిరిగారు.

ప్రక్కనే హుస్సేన్ మాస్టార్.

శర్మగారికి ఆనందంతో నోట మాట రాలేదు. వెంటనేలేచి కూర్చున్నారు.

"ఎప్పుడు వచ్చారుమాస్టార్? వచ్చి మాట్లాడకుండానే కూర్చున్నారే?"

"ఇప్పుడేవచ్చాను మాస్టార్. మీరేదో ఆలోచనలలో వుండేసరికి డిస్టర్బ్ చేయటము ఇష్టములేక ఊరికే కూర్చు న్నాను"

"భలేవారు మాస్టార్. నేను ఆనాటి మన మొదటి పరిచయాన్ని మననం చేసుకొంటున్నాను. ఈ ఒంటరివాడికి మీ వంటి మంచిస్నేహితుడ్ని అందించి నందుకు ఆదేవుడికి కృతజ్ఞతలు తెలుపు కొంటున్నాను.

హుస్సేన్ మాస్టారు మాట్లాడలేదు. చిన్నగా నవ్వి వూరుకున్నారు. అప్ర యత్నంగా వారి కళ్ళల్లో నీళ్ళు వుబి కాయి.

శర్మగారు కంగారు పడ్డారు. "ఏమిటి మాస్టారు! ఏం జరిగింది?"

"మాస్టారు.... నేను.... నేను.... దొంగనంట మాస్టారు. నేను దొంగతనం చేశానంట మాస్టారు...."

శర్మగారికి అంతులేని కోపం వచ్చింది "ఎవరన్నారు?"

"నా కోడలు గౌసియాబేగం అంది, అవి బీరువాలోనుంచి డబ్బులు తీసి ఎవడికో ఇస్తుంటే నేను నా కళ్ళారా చూశాను. చివరికి నా కొడుకు జాఫర్ గాడు వచ్చి బీరువాలో డబ్బులు ఏమయ్యాయని అడిగితే అది ఆ గౌసియాబేగం నా పేరు చెప్పింది. అది బయట్నుంచి ఇంట్లోకి వస్తుంటే నేను బీరువా దగ్గర్నుంచి వస్తున్నానంట. అది కళ్ళారా చూసిందంట. అంతే ఆ జాఫర్ గాడు దయా దాక్షిణ్యం లేకుండా తండ్రి అని కూడా తలచకుండా పెళ్ళాం మాటలు నమ్మి, నన్ను చితకబాదాడు...."

"ఊరుకోండి మాస్టారు మన బ్రతుకులు ఇంతే. మనం సంపాదించినంత కాలం కూర్చొని మేస్తారు. మనం సంపాదించలేని స్థితికొచ్చేసరికి మనల్ని చీమల్ని దోమల్నిగా చూస్తారు. సరే ఈ బాధలు మనకు ఎప్పుడూ వుండేవేగా. ఈ శనక్కాయలు తీసుకోండి." పొట్లం విప్పి పిడికెడు కాయలు హుస్సేన్ మాస్టారి చేతిలో పెట్టబోయారు.

"వద్దు మాస్టారు రోజూ మీరేదో ఒకటి తెచ్చి పెడుతున్నారు. నేను ఏదీ తేలేకపోతున్నాను. ఆ గౌసియాబేగం, ఆ జాఫర్ గాళ్లు అనేకమైనవి వండుకొని తింటుంటారు. కాని నా మొఖాన ఏదీ పొయ్యరు. ఏమైనా సరే నేను మీకు రేపు తప్పకుండా ఏదైనా తీసుకొస్తాను. రేపు గారెలు చేస్తారని గౌసియాబేగం జాఫర్ గాడితో అంటుంటే విన్పించింది. రేపు తప్పకుండా అది చూడకుండా గారెలు తీసుకొస్తాను.

* * *

గౌసియాబేగం పొయ్యి దగ్గర కూర్చొని గారెలు వండుతుంది.

ఆమె ప్రక్కనే గారెలబుట్ట వుంది.

హుస్సేన్ మాస్టారు అడుగులో అడుగు వేసుకుంటూ చిన్నగా వంగి బుట్టలోని పది, పన్నెండు గారెలు అందుకున్నారు.

వండిన గారెలు బుట్టలో వేయటానికి ఇటు తిరిగిన గౌసియాబేగం బుట్టలో గారెలు లేకపోవటం చూసి ఆశ్చర్యపోయింది.

అంతదూరంలో హుస్సేన్ మాస్టారు చకచకా వెళ్ళటం కన్పించింది.

"ఆగు." గౌసియాబేగం రాక్షసిలా అరిచింది.

అదిరిపడ్డారు హుస్సేన్ మాస్టారు.

అక్కడే ఆగిపోయారు.

"నన్ను అడిగితే నీ మొఖానపారేసే దాన్నిగా. ఇంతవయసువచ్చినా నీకు సిగ్గు లేదూ దొంగతనంచేయటానికి. ఇలాఎన్ని దొంగతనాలుచేస్తావు? నీకొడుకురానీ నీ తాట వలిపిస్తాను.

అప్పుడే అక్కడకువచ్చిన జాఫర్

ఆమాటలు విన్నాడు, ప్రళయకాల క్రోధంతో బెల్టుతీసి హుస్సేన్ మాష్టారుదగ్గరికి గుడ్లు ఉరుముతూ వచ్చాడు.

హుస్సేన్ మాష్టారు భయంతో గజ గజా వణికిపోసాగారు.

ఛెళ్....ఛెళ్....ఛెళ్

హుస్సేన్మాష్టారు రెండుచేతులు జోడించి ప్రాణభీతితో గావు కేకలు పెడుతున్నారు,

అయినా ఆ రాక్షసుడి హృదయం కరగటంలేదు.

కొట్టికొట్టి అలిసిపోయాడుకాబోలు బెలు ఫ్యాంటుకి చుట్టుకున్నాడు. "ఛీ నువ్వు ఇంట్లోవుండొద్దు. బయటకుచావు" హుస్సేన్మాష్టార్ని మెడపట్టి బయటకు గెంటాడు.

గౌసియాబేగం తలుపులు విసురుగా మూసింది.

హుస్సేన్మాష్టారు విసురుగావెళ్ళి బయట రోలుమీదపడ్డారు. అంతే హుస్సేన్మాష్టారు తలపగిలింది.

రక్తం మడుగయింది. హుస్సేను మాష్టారు చావుకేకపెట్టారు.

★ ★

శర్మగారు సముద్రంఒడ్డునహుస్సేన్ మాష్టారికోసం ఎదురుచూచిఎదురుచూచి వారు రాకపోయేసరికి వారిఇంటికిబయలు దేరారు. "ఇవాళఏమిటి మరీ ఆలస్యం అయింది. ఎప్పుడూ ఇంత ఆలస్యం కాలేదు. ఒకవేళ మాష్టారికి ఒంట్లో ఆరోగ్యంబాగోలేదా! వద్దు భగవాన్ హుస్సేన్ మాష్టార్ని ఆరోగ్యంతో పదికాలాలు చల్లంగా బ్రతకనీ మనసులో దేముడికి మొక్కుకుంటూ మలుపు తిరిగారు శర్మగారు.

ఎక్కడో ఏడుపులు వినిపించాయి.

ఉలిక్కిపడి చూశారు.

హుస్సేన్ మాష్టారి ఇంటిచుట్టూ జనం పోగయివున్నారు.

ఏడుపులు, పెడబొబ్బలతో ఆ ఇల్లు మార్మోగుతుంది.

శర్మగారు పరుగు పరుగున అక్కడికి వెళ్ళారు.

అంతే. శర్మగారికి నోటమాటరాలేదు.

ఎదురుగా నేలమీద హుస్సేన్ మాష్టారి శవం.

శవంమీదపడి గౌసియాబేగం,జాఫర్ఖాన్ ఏడుపుతో గొప్పగా నటిస్తున్నారు.

"మనుష్యులు ఎంతగొప్పగానటించగలరు?. నటన వాళ్ళకి వెన్నతో పెట్టిన విద్యకాబోలు. బ్రతికినంతకాలం మన చావుని కోరుకుంటూ చిత్రహింసలు పెడతారు. చచ్చాక ఎక్కడలేనిప్రేమ ఒలకబోస్తూ, గుండెలు బాదుకొంటూ శోకాలు పెడతారు".

శర్మగారు ఆ నటుల్ని అసహ్యంతో చూస్తూ శవం దగ్గరికి సమీపించారు.

హుస్సేన్ మాష్టార్ని శవంలా చూసేసరికి వారిగుండె చెరువయింది.

కూర్చొని వారి తలని ఒళ్ళోకి తీసుకున్నారు.

శర్మగారికి నటన చాతకాదు.

వారి కళ్ళల్లోనుంచి ఒక్క కన్నీటిబొట్టుకుడా బయటికి రాలేదు.

ప్రేమగా వారి నుదుటమీద ముద్దు పెట్టుకున్నారు.

బరువెక్కిన గుండెతో చిన్నగా లేవబోయారు.

ఆ శవం చుట్టుప్రక్కల అంత దూరంలో నేలమీద గారెలు చెల్లాచెదురుగా కన్పించాయి.

అంతకుముందురోజు హూస్సేన్ మాష్టారు అన్నమాటలుగుర్తు కొచ్చాయి.

శర్మగారు బాధగా నిట్టూర్చి ఆ గారెలన్నీ ఏరుకున్నారు.

ఏడుస్తున్న జనం నోర్లు తెరచి చోద్యంలా చూస్తున్నారు.

అయినా శర్మగారు పట్టించుకోలేదు.

ప్రాణ స్నేహితుడు పెట్టే తిను బండారంలో ఎంతప్రేమ వుంటుందో, వారి స్నేహంలో ఎంతపవిత్రత వుంటుందో ఆ పరమనీచులకేమి తెలుసు?

ఆ గారెల్ని చేత్తోపట్టుకొని అక్కడ్నుంచి కదిలి రోడ్డుమీదకొచ్చాడు. భగవంతుడా ఎందుకయ్యా నాకు ఇంత అన్యాయంచేశావు? నాకున్న ఒకే ఒక మంచిస్నేహితుణ్ని అప్పుడే ఎందుకు తీసుకెళ్ళావయా?. ఈ పాపిష్టిమనుష్యుల మధ్య బ్రతకలేడని, ఈ బాధలు ఇంకా ఇంకా పడలేడని తీసుకెళ్ళావా? మరి నన్ను ఎందుకు తీసుకెళ్ళలేదయ్యా?..."

* * *

"ఈగారెలు తినకూడదు, స్నేహితుడి జ్ఞాపక చిహ్నాలివి. వీటిని జాగ్రత్తగా దాచుకోవాలి" గారెలను చేతితో పట్టుకొని వాటిని ముద్దుపెట్టుకో సాగారు సత్యనారాయణశర్మగారు.

అంతలో అక్కడికి అల్లుడు నారాయణశర్మ. అతనిభార్య నిర్మలకుమారి ప్రత్యక్షమయ్యారు.

మీ చేతిలో గారెలు ఎక్కడివి?గర్జించాడు నారాయణశర్మ

"ఇవి.... ఇవి...."మాటలు తడుముకుంటూ ఏదో చెప్పబోయారు శర్మగారు

"ప్రొద్దున రెండుగారెలు పెట్టినా చాలకఎవరూ చూడకుండా దొంగతనం చేశారన్నమాట?" కూతురు నిర్మలా కుమారి అసహ్యించుకుంది.

"లేదమ్మా.... ఇవి...."

"సర్లె ఇక ఆపండి- ఇంత వయసొచ్చినా సిగ్గులేవపోతే సరి! మొన్న వెండి కంచము పోయిందంటే- నేను తీయలేదంటే తీయలేదన్నారు.

మరిఇవాళ యేంచేశారు? ఈరోజున ఈ గారెల దొంగతనము చేసినమీరుమొన్న ఆ వెండికంచముకాజేసి అమ్ముకోలేదని నమ్మకమేమిటి? మీరు ఇంటిలోవుంటే ఇంకా ఎన్నోపోతాయి. మా ఇల్లంతా గుల్లవుతుంది. వేళకింత పడేస్తాము, పోయి ఆగొడ్లపాకలో వుండండి" శర్మగారిని మెడపట్టి బయటకుగెంటి తలుపు ఛళ్ళున మూసాడు నారాయణశర్మ.

ఒకరోజు

రెండురోజులు

మూడురోజులు....

కాలచక్రం గిరగిరా తిరిగిపోతుంది-

అన్నంమెతుకుకూడా ఆ గుమ్మం దాటి ఈ గొడ్లపాకకి రావటంలేదు.

కళ్ళు తిరుగుతున్నాయి.

ఒళ్లు తూలుతుంది.

పడుకున్నచోటనుంచి లేచే శక్తి కూడ లేక, ఈగలు, దోమలు జుయ్ మంటూ హింసిస్తున్నా విసురుకొనే శక్తిలేక.ఆ బురదలో అలాగే పడుకున్నారు శర్మగారు.

ఆకలి....ఆకలి....

నీరసంతో మూలుగుతున్నారు.

కళ్ళు మూతలుపడుతున్నాయి.

కళ్ళముందు మసకపొరలు కమ్ముకుంటున్నాయి.

ఇగ ఆగలేకపోయారు.

గారెలపొట్లం విప్పారు.

అపురావురమని తినసాగారు.

ఆ గారెలు పాచిపోయి తీగలు సాగుతూ, వాసన వేస్తున్నాయి.

అయినా తినటం ఆపటంలేదు.

అవురావురమని తింటూనే వున్నారు.

అవునుమరి ఆకలి రుచిఎరుగదు.

"అమ్మో....అన్నిగారెలు తినేస్తున్నానే. స్నేహితుడి జ్ఞాపకచిహ్నంగా వుండొద్దూ!. ఈ ఒక్కముక్క తిన కూడదు. ఈఒక్కముక్కదాచుకోవాలి."

ఆకలి....ఆకలి....

నీరసం....నీరసం....

అయినా చేతిలోని గారెముక్కని తినటంలేదు. దాన్ని ఆప్యాయంగా ఆలాగా చూచుకుంటున్నారు.

ఈ అంతులేని అకల్ని ఈ నాలుగు గారెలు ఆపుతాయా?

ఆపలేవు.

అంతే. శర్మగారి కళ్లు మూతలు పడ్డాయి.

* * *

శర్మగారి బంధుమిత్రులంతా సపరివారంగా విచ్చేసి గుండెలు బాదుకుటూ గోడు గోడున ఏడుస్తున్నారు.

అల్లుడు నారాయణశర్మ, కూతురు నిర్మల కుమారి అందరికన్నా పెద్దగా, అందరి కన్నా ఎక్కువగా ఏడుస్తుంది.

అవును. నటులు చాలా గొప్పగా ఎడ్వగలరు.

అంత ఏడుపులోను నారాయణ శర్మ శర్మగారి చేతి పిడికిలి మీద పడ్డాయి.

శర్మగారి చేతి పిడికిలిగట్టిగా బిగుసుకుని వుంది.

"ఆ పిడికిలిలో ఏముంది? ఇంట్లో బంగారం గాని, డబ్బులుగాని కాజేయ లేదు కదా?..." అనుమానం రావటం తరువాయి వెంటనే లేచాడు నారాయణ శర్మ.

దగ్గరి కెళ్ళి చేతి పిడికిలి గట్టిగా తెరిచాడు,

అంతే. ఆశ్చర్యంతో నోట మాట రాక నోరు తెరిచాడు.

ఆ చేతి పిడికిలో వుంది—

బంగారం కాదు....

డబ్బు కాదు....

అంతకన్నా విలువైన గారెముక్క

★